www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 6 జూన్ 2024
5
ఏలూరు

విసిచే పీజీ సెంటర్ భవనం పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణంలోని కృష్ణా యూనివర్సిటీ డాక్టర్ ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న నూతన భవనాన్ని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జ్ఞానమణి బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా జ్ఞానమణి మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన భవన నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎమ్‌డి దివాన్‌రెడ్డి, చీఫ్ ఇంజినీర్ నరసింహమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాయన్న, ప్రిన్సిపల్ డాక్టర్ నవీన లావణ్య లత, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

భవనాలను పరిశీలిస్తున్న బృందం

గెలుపు కేరింత.. ఓటమి నిట్టూర్పు..!

జోష్‌లో రెండు జిల్లాల్లోని కూటమి శ్రేణులు
నిర్వేదంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు
పోలవరం మినహా అన్ని నియోజకవర్గాల్లో కూటమికి 50 శాతానికిపైగా ఓట్లు
పోస్టల్ బ్యాలెట్‌లోనూ అదే ఒరవడి
అనూహ్య మెజార్టీలపై టిడిపి కూటమి అభ్యర్థుల్లో విస్మయం
ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం, అధిక భారాలపైనే ప్రజల తీర్పు
పందేల్లో భారీగా నష్టపోయిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల ఘట్టం ముగిసింది. మంగళవారం వెలువడిన ఫలితాలతో రెండు జిల్లాల్లోనూ టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులంతా కేరింతలు, ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతుండగా, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మాత్రం నిర్వేదంలో మునిగిపోయారు. రెండు జిల్లాల్లోనూ ఒక ఎంఎల్‌ఎగాని, ఎంపీగానీ గెలవకపోవడం ఆ పార్టీ శ్రేణులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. గెలుపుతోపాటు కూటమి అభ్యర్థులకు వచ్చిన ఓట్ల మెజార్టీ వైసిపి నాయకులను, కార్యకర్తలను నివ్వెరపోయేలా చేస్తోంది. గత ఎన్నికల్లో 30 వేలకుపైగా మెజార్టీతో గెలిచిన వైసిపి ఎంఎల్‌ఎలు ఈసారి 40 వేలు, 50 వేలు అంతకుపైగా ఓట్ల తేడాతో ఓటమి పాలవడాన్ని నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో వైసిపి నాయకులు బుధవారం దాదాపు ఇళ్లకే పరిమితమయ్యారు. బయటికి వచ్చిన పని చూసుకుని ఇంటికి తిరిగి వెళ్లిపోయిన పరిస్థితి కన్పించింది. ఏలూరు జిల్లాలో పోలైన ఓట్లలో ఏలూరు నియోజకవర్గంలో 67 శాతం టిడిపి అభ్యర్థి బడేటి చంటికి రావడం, వైసిపి అభ్యర్థికి 29.57 శాతం ఓట్లు మాత్రమే రావడం అందరినీ నివ్వెరపర్చింది. దెందులూరులో టిడిపి అభ్యర్థికి 55.11 శాతం, చింతలపూడిలో 53.3 శాతం, నూజివీడులో 51.12 శాతం, ఉంగుటూరులో 59.63 శాతం, కైకలూరులో 60.38 శాతం ఓట్లు కూటమి అభ్యర్థులకు వచ్చాయంటే ఎన్నికల్లో ప్రజలు ఎంత ఏకపక్షంగా ఓట్లు వేశారో అర్థం చేసుకోవచ్చు. ఏలూరు జిల్లాలో ఒక్క పోలవరంలోనే 50 శాతంలోపు 46.33 శాతం ఓట్లతో జనసేన అభ్యర్థి గెలిచారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ అదే పరిస్థితి కొనసాగింది. తణుకులో టిడిపి అభ్యర్థికి 66.51 శాతం ఓట్లు లభించాయి. పాలకొల్లు, ఆచంట, తాడేపల్లిగూడెం, ఉండి తదితర అన్ని నియోజకవర్గాల్లోనూ 50 శాతానికిపైగా ఓట్లు కూటమి అభ్యర్థులకు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనూ అదే ఒరవడి కనిపించింది. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 2,193 పోస్టల్ బ్యాలెట్లకుగాను జనసేన అభ్యర్థికి ఏకంగా 1488 ఓట్లు రాగా వైసిపి అభ్యర్థికి కేవలం 506 ఓట్లు మాత్రమే వచ్చాయి. ప్రతి నియోజకవర్గంలోనూ 60 శాతానికిపైగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూటమికి దక్కాయి. ఈ కారణంగానే కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీలను సొంతం చేసుకున్న పరిస్థితి ఉంది. ఎంపీ స్థానాల్లోనూ నరసాపురం కూటమి అభ్యర్థికి 57.41 శాతం ఓట్లు రాగా వైసిపి అభ్యర్థికి 34.94 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ఏలూరులో కూటమి ఎంపీ అభ్యర్థికి 54 శాతం ఓట్లురాగా వైసిపి అభ్యర్థికి 40.84 శాతం ఓట్లు లభించాయి. ఇంత దారుణ ఓటమికి కారణాలు ఏమిటనే దానిపై రెండు జిల్లాల్లోనూ చర్చోపచర్చలు సాగుతున్నాయి.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం.. అధిక భారాలపైనే ప్రజల తీర్పు

వైసిపి ఓటమికి ప్రధాన కారణం ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం, అధిక భారాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గత ఎన్నికల్లో జిల్లాకు ఇచ్చిన ఏఒక్క హామీని వైసిపి ప్రభుత్వం నెరవేర్చలేదు. తాగునీరు అందించడం, పోలవరం నిర్వాసితుల సమస్యలు, చింతలపూడి రైతులకు పరిహారం, డెల్టా ఆధునికీకరణ, రోడ్లు వేయకపోవడం, కొల్లేరు సమస్యను పట్టించుకోకపోవడం, వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పకపోవడం, ధాన్యం అమ్ముకునేందుకు రైతులు మిల్లర్లకు ఎదురు సొమ్ము ఇవ్వడం వంటి అనేక సమస్యలను వైసిపి పట్టించుకోలేదు. చెత్త, ఆస్తిపన్ను, విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీల పెంపు వంటి అంశాలు వైసిపిని దెబ్బతీశాయి. సంక్షేమ పథకాలు ఇస్తున్నాం కాబట్టి ఏం చేయకపోయినా ప్రజలు పట్టించుకోరు అనే ధోరణిలో వైసిపి ప్రభుత్వం వ్యవహరించిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. స్థానిక వైసిపి నాయకత్వం గ్రామాల్లో వ్యవహరించిన తీరు ప్రజల్లో తీవ్ర కోపాన్ని రగలించింది. రెండు జిల్లాల్లో వైసిపికి ఒక్క సీటూ రాకపోవడానికి ప్రజలు పడుతున్న ఇబ్బందులే కారణమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. కొత్త ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకుని ముందుకు సాగుతుందో.. లేదో వేచిచూడాలి.

పందేల్లో భారీగా నష్టపోయిన వైసిపి శ్రేణులు

ఈ ఎన్నికల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పందేల్లో భారీగా నష్టపోయారు. ప్రతి నియోజకవర్గంలోనూ రూ.కోట్లలో భారీగా పందేలు కాశారు. ఎగ్జిట్‌పోల్స్ వచ్చిన తర్వాత మరిన్ని పందేలు సాగాయి. సామాన్య కార్యకర్తలు కూడా రూ.వేలల్లో పందేలు కాసి నష్టపోయారు. చాలామంది అప్పు చేసి మరీ బెట్టింగులు వేశారు. అలాంటి వారంతా లబోదిబోమంటున్నారు. ఈ పరిణామం వైసిపి శ్రేణులను మరింత కుంగదీస్తోంది.

ఏలూరు జిల్లాలో కూటమి, వైసిపి అభ్యర్థులకు వచ్చిన ఓట్ల శాతం

నియోజకవర్గం	కూటమి ఓట్లు	వైసిపి ఓట్లు
ఏలూరు	67	29.57
దెందులూరు	55.11	41.62
చింతలపూడి	53.3	40.93
నూజివీడు	51.12	45.27
ఉంగుటూరు	59.63	35.02
పోలవరం	46.33	42.07
కైకలూరు	60.38	35.36

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఉపాధి హామీ కింద పండ్ల తోటల పెంపకం
కలెక్టరేట్‌లో మొక్కలు నాటిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్ ఆవరణలో బుధవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. కాలుష్యాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మొక్కలను నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జిల్లావ్యాప్తంగా ఉపాధిహామీ కింద డ్వామా ఆధ్వర్యంలో 4,500 ఎకరాల్లో పండ్ల మొక్కలు పెంచాలని నిర్ణయించామన్నారు. దీనిలో భాగంగా మూడు వేల ఎకరాలు గుర్తించి అంచనాలు తయారు చేశారన్నారు. ప్రహరీ ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, సంస్థల్లో పండ్ల మొక్కల పెంపకానికి ప్రతి మండలంలో విద్యాసంస్థలు గుర్తించి అంచనాలు తయారు చేశామన్నారు. ఉపాధిహామీలో భాగంగా పంచాయతీ, ప్రభుత్వ భూముల్లో మొక్కల పెంపకానికి 45 ఎకరాలు గుర్తించామన్నారు. రోడ్లు, కాల్వగట్ల వెంబడి 75 కిలోమీటర్ల మేర మొక్కల పెంపకానికి చర్యలు తీసుకున్నామన్నారు. పాడి పశువులు కలిగిన రైతులకు గడ్డి పెంపకానికి 225 ఎకరాలు గుర్తించామన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.రాము, కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కకు నీళ్లు పోస్తున్న కలెక్టర్

చింతలపూడిలో చిరుత కలకలం

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని కంచనగూడెం గ్రామంలో చిరుత పులి హల్‌చల్ చేసింది. దీంతో కంచనగూడెం గ్రామస్తులతోపాటు బంధంచర్ల అడవి చుట్టుపక్కల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కంచనగూడెం గ్రామంలో పి.నాగేశ్వరరావుకు చెందిన దూడపై చిరుత పులి దాడి చేసింది. ఆదివారం పులిజాడ కనిపించడంతో ఫారెస్ట్ అధికారులకు తెలియజేశారు. రేచర్ల వాటర్‌ట్యాంక్ సమీపంలో పులిజాడలున్న ప్రాంతాన్ని అధికారులు అడవి జంతువుగా ప్రకటించారు. అయితే మంగళవారం కంచనగూడెంలో లేగ దూడపై గుర్తుతెలియని జంతువు దాడి చేసిందని గ్రామస్తులు అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఫారెస్ట్ అధికారులు ట్రాప్ కెమెరాలు అమర్చగా వాటిలో చిరుత పులి సంచారం బయటపడింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. ఏలూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కుమార్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కంచనగూడెం, బంధంచర్ల అటవీ ప్రాంతంలోకి ఒంటరిగా వెళ్లొద్దని ప్రచారం చేశారు. చిరుతపులి సమీప అడవిలోకి వెళ్లి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.


ట్రాప్ కెమెరాలో చిక్కిన చిరుత

పలుచోట్ల గాలులు, భారీ వర్షం

కూలిన చెట్లు.. రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి - పోలవరం

జిల్లాలో బుధవారం సాయంత్రం జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ స్తంభాలు విరిగిపడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పోలవరం మండలంలో బుధ వారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు రహదారులపై చెట్లు కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలవరం నుండి తహాశీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో రోడ్లపై చెట్లు కూలాయి. స్టేట్‌బ్యాంక్ సమీపంలో విద్యుత్ స్తంభం ఒక ఇంటిపై కూలింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. పోలవరంలో తహాశీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఏడు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. కొత్త నూతనగూడెంలో రేకుల షెడ్డుపై చెట్టు కూలింది. కన్నాపురం అడ్డరోడ్డు నుండి కన్నాపురం వెళ్లే మార్గంలో పలుచోట్ల రోడ్లపై చెట్లు కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. బుట్టాయగూడెం మండలంలోనూ ఇదే పరిస్థితి కన్పించింది.

పోలవరంలో కూలిన చెట్లు.. తెగిపడిన విద్యుత్ తీగలు

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

నియోజకవర్గ సమస్యల పరిష్కారమే ధ్యే యంగా పనిచేస్తానని ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్య నారాయణ అన్నారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లా డుతూ రాష్ట్రంలో జగన్ క్రూరమైన రాజకీయంతో ప్రజలు విసిగిపోయారని, దీంతో కూటమి అభ్యర్థులు 164 సీట్లు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ప్రజల తీర్పుతో వైసిపికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. కేవలం సింగల్ డిజిట్‌తో వైసిపి ఫ్యాన్ రెక్కలు విరిగిపోయాయన్నారు. దుర్మార్గమైన పరిపాలన, కక్షపూరితమైన అవినీతి రాజకీయంపై ప్రజలు తిరుగుబాటు చేశారన్నారు. ఇక్కడ మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు రోజుకో అబద్ధం ఆడుతూ అవినీతి చక్రవర్తిగా రైతుల డబ్బులు దోచుకోవడంతో రైతులు తిరస్కరించారన్నారు. ఎంఎల్‌ఎగా తాను నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను అమలు చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఎంఎల్‌ఎగా తనను గెలిపించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయి

ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

టిడిపి కూటమి విజయంతో రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరుగుతుందని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘు రామకృష్ణంరాజు పేర్కొన్నారు. ఆయన ప్రజాశక్తితో టిడిపి కూటమి గెలుపు ఆనందాన్ని పంచుకున్నారు. చంద్ర బాబు కష్టం, పవన్‌కళ్యాణ్ త్యాగంతో కలగలిపిన విజయమన్నారు. ప్రజా తీర్పుతోనే టిడిపి కూటమి అత్యధిక స్థానాలు కైవసం చేసుకుందన్నారు. మరోసారి దేశ రాజకీయాల్లో చంద్రబాబు చక్రం తిప్పే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రజలందరికీ ప్రగతితోపాటు సాధికారత రావాలి, అభివృద్ధి, సంక్షేమం అందరికీ అందాలని తెలిపారు. రాబోయే రోజుల్లో అమరావతి, పోలవరం పనులు జరగాలని ఆకాంక్షించారు. ఎంపీగా పోటీ చేయకుండా ఎంఎల్‌ఎగా చేశానని, ఉండి నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుస్థాయిలో 56,777 ఓట్ల మెజార్టీ సాధించడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

చింతలపూడి ఎత్తిపోతల ప్రారంభమే ధ్యేయం

నూజివీడు ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేసి నా హయాంలోనే ప్రారంభోత్సవం చేయడమే తన లక్ష్యమని నూజివీడు ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. తనను గెలిపించిన నూజివీడు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నూజివీడు పట్టణం, నూజివీడు రూరల్, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల్లో అన్ని గ్రామాలను అభివృద్ధి బాటలోకి తీసుకెళ్తానన్నారు. చంద్రబాబుతో మాట్లాడి వ్యవసాయ రంగంతోపాటు పారిశ్రామిక రంగం అభివృద్ధి, సాగు, తాగునీరుకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా కృషి చేస్తానన్నారు. కూతవేటు దూరంలో ఉన్న పారిశ్రామిక మల్లవల్లి ఏవిధంగా అభివృద్ధి చెందిందో అదేవిధంగా నూజివీడు ప్రాంతాన్ని కూడా పారిశ్రామికంగా అభివృద్ధి చేసేలా చర్యలు చేపడతానన్నారు. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరుస్తానని తెలిపారు. విద్యా వ్యవస్థ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారికి అండగా ఉంటానన్నారు.

ఎంఇఒ, డివైఇఒల తీరు దారుణం : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెంలో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగిస్తున్న ప్రయివేటు విద్యాసంస్థలకు ఎంఇఒ, డివైఇఒ కొమ్ముకాస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు ఆరోపించారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో పరిస్థితులపై తాము నిర్వహించిన సర్వేలో పలు ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయన్నారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో పుస్తకాలు అమ్ముతున్నారని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. చైతన్య స్కూల్లో పుస్తకాలు ఉన్న గదిని స్థానిక ఎంఇఒ రాముడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సీజ్ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ పట్టణంలో పలు ప్రయివేటు విద్యాసంస్థల్లో పుస్తకాలు అమ్ముతున్నారన్నారు. ఏడో తరగతి విద్యార్థికి స్కూలు ఫీజు రూ.32 వేలు, పుస్తకాల ఫీజు రూ.ఎనిమిది వేలు, నాలుగో తరగతి విద్యార్థికి ఫీసు రూ.28 వేలు, పుస్తకాలు ఫీజు రూ.8400 వసూలు చేస్తుండటం గమనార్హమని తెలిపారు. దీనిపై ఎంఇఒ దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన లేదన్నారు. పుస్తకాలు విద్యాసంస్థ ఆవరణలో కాకుండా బయట దుకాణం పెట్టుకుని అమ్ముకోండని విద్యాశాఖాధికారులే ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచనలివ్వడం దారుణమని విమర్శించారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, తక్షణమే ఎంఇఒపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జంగారెడ్డిగూడెంలోని ప్రయివేటు విద్యాసంస్థలో పుస్తకాల అమ్మకాన్ని చూపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా

నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

నియోజకవర్గ ప్రజలకు ఐదేళ్లు అండగా ఉండి, అభివృద్ధికి కృషి చేస్తానని నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కూటమి నేతలతో కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. తన గెలుపునకు రాత్రీ పగలు కృషి చేసిన కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గెలిపించిన నరసాపురం నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని చెప్పారు. ఎన్నికల్లో భారీ మెజార్టీ అందించిన నియోజకవర్గ ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేస్తానని, ప్రతి నిమిషమూ ప్రజల కోసం గడుపుతానని చెప్పారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో, చంద్రబాబు ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానని చెప్పారు.

అభివృద్ధికే ప్రాధాన్యత

కైకలూరు ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్

ప్రజాశక్తి - కైకలూరు

నియోజకవర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తానని ఎంఎల్‌ఎగా గెలుపొందిన కామినేని శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ గతంలో వైసిపి ఎంఎల్‌ఎ నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులతో కలిసి కొందరు అధికారులు ప్రజలను వేధించారని, వారిపై తప్పక చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలతో అరాచకాలకు పాల్పడిన వారిని గుర్తించి జిల్లా బహిష్కరణ చేస్తానని తెలిపారు. కొల్లేరు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యకర్తలు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలని, అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతా

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు జిల్లా సంపూర్ణ అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా ప్రతి నియోజకవర్గంలో ఒక పరిశ్రమ ఏర్పాటు లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. పోలవరం, ఉంగుటూరు, నూజివీడు నియోజకవర్గాల్లో ఫ్యాక్టరీల స్థాపనకు ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు చింతలపూడి, నూజివీడు ఎంఎల్‌ఎతో కలిసి పని చేస్తానన్నారు. జిల్లాలో ముఖ్యంగా మహిళలు, నిరుద్యోగులు, యువత తనను ఎక్కువగా ఆదరించారని, అందరికీ మేలు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తాను ఎంపీగా బరిలోకి దిగినప్పుడు జిల్లాను ఏవిధంగా అభివృద్ధి చేస్తానని చెప్పానో అంతకుమించి అభివృద్ధి చేస్తానన్నారు. ఏలూరులో వందేభారత్ స్టాప్ కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఎంపీగా తనను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

'పోలవరం' అభివృద్ధికి కృషి చేస్తా

ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. పోలవరంలోని ఏడు మండలాల ప్రజలు తనపై నమ్మకం ఉంచి గెలిపించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, టిడిపి అధినేత చంద్రబాబు, ప్రధాని మోడీ సహకారంతో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి చేయకుండా వదిలేసిన రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా చూస్తానని తెలిపారు. ఎన్‌డిఎ కూటమి గెలుపునకు సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రతిఒక్కరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు.

పవన్‌ను కలిసిన ఎంఎల్‌ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు ఎంఎల్‌ఎగా గెలుపొందిన పత్సమట్ల ధర్మరాజు బుధవారం మంగళగిరిలో జనసేన కార్యాలయంలో పవన్‌కల్యాణ్, నాగబాబు, నాదెండ్ల మనోహర్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఓట్ల లెక్కింపు, మండలాల వారీగా వచ్చిన మెజార్టీ వివరాలు, కార్యకర్తలు, కూటమి కష్టపడిన తీరును చర్చించినట్లు తెలిసింది.


పవన్‌కల్యాణ్‌తో ఉంగుటూరు ఎంఎల్‌ఎ ధర్మరాజు

ఎన్ఎంఎంఎస్‌కు హారిక ఎంపిక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని తోటపల్లి ఎంపియుపి పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కొంకా హారిక నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు టి.శోభన్‌బాబు తెలిపారు. ఈ ఉపకార వేతనాన్ని కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన, తెలివిగల విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిందని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొంకా హారికను గ్రామ సర్పంచి, ఆరేపల్లి శ్రీపద్మ, ఎంఇఒ-1 కె.సర్వేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు టి.శోభన్‌బాబు, ఉపాధ్యాయులు ఎస్.వెంకటలక్ష్మి, జె.జ్ఞానసుందరం అభినందించారు.


హారికను అభినందిస్తున్న హెచ్ఎం శోభన్‌బాబు

ఎస్‌బిఐ బ్రాంచి మేనేజర్‌గా రమ్య

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆగిరిపల్లి బ్రాంచి నూతన మేనేజర్‌గా మల్లంపాటి రమ్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాతాదారులు ఎటువంటి అసౌకర్యాలకు గురికాకుండా, మెరుగైన సేవలను అందించడమే ధ్యేయంగా పని చేస్తానని చెప్పారు. ఎస్‌బిఐ నూజివీడు బ్రాంచిలో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్న రమ్య ఆగిరిపల్లి ఎస్‌బిఐ బ్రాంచి మేనేజర్‌గా రాగా, ఇక్కడ పనిచేస్తున్న సునీల్ విశాఖపట్నానికి బదిలీ అయ్యారు.


మల్లంపాటి రమ్య


కేక్ కట్ చేస్తున్న ధర్మరాజు

విజయోత్సవ కేక్ కట్ చేసిన ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు ఎంఎల్ఎగా అఖండ మెజార్టీతో విజయం సాధించిన పత్సమట్ల ధర్మరాజు విజయోత్సవ కేక్ బుధవారం కట్ చేశారు. నారాయణపురంలో ఆయన స్నేహితులు, అభిమానులు భారీ కేక్ కోయించి తమ అభిమానాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో గుణ్ణం బుల్లెబ్బాయి, మనోజ్ పాల్గొన్నారు.


చింతమనేనిని అభినందిస్తున్న అభిమానులు, పార్టీ శ్రేణులు, మహిళలు

చింతమనేనికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు నుంచి 26 వేలకుపైగా మెజారిటీతో టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా గెలుపును సొంతం చేసుకున్న చింతమనేని ప్రభాకర్‌ని బుధవారం నియోజకవర్గానికి చెందిన పలువురు కలిసి పూలబొకెలు, పూలమాలలతో అభినందిం చారు. నియోజకవర్గంలోని దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల నుంచి చింతమనేని అభిమానులు, టిడిపి కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, డ్వాక్రా అక్క చెల్లెమ్మలు దుగ్గిరాలకు చేరుకొని ఆయనను అభినందించారు.

అంగన్వాడీల్లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ జంగారెడ్డిగూడెం పరిధిలోని ద్వారకాతిరుమల సెక్టార్‌లో గుండుగోలనుకుంట సచివాలయ పరిధిలో ఇసిసిఇ డే, గ్రాడ్యుయేషన్ డే బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ టి.మేరీ, జిఎంఎస్‌కె.సృజన, ఎంపిహెచ్ఒ సర్జన్, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, తల్లులు, గర్భిణులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలని జీలుగుమిల్లి సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ తెలిపారు. ఇసిసిఇ డే సందర్భంగా జీలుగుమిల్లి అంగన్వాడీ కేంద్రం-2లో బుధవారం నిర్వహించని మన అంగన్వాడీ పిలుస్తుంది అనే కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీలో పిల్లలకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలని తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్వాడీలో ప్రీ స్కూల్‌తో పాటు పిల్లలకు పోషకాహారంతో కూడిన ఆహారం ఇస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కె.సరలకుమారి, అరుణ పాల్గొన్నారు.

కామవరపుకోట : తడికలపూడిలోని అంగన్వాడీకేంద్రం-136లో జంగారెడ్డిగూడెం సిడిపిఒ పి.భ్యులా అధ్యక్షతన ఇసిసిఇ డే, ప్రపంచ పర్యావరణ దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మునగ, కరివేపాకు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పి.భ్యులా మాటాడుతూ తల్లితండ్రులు పిల్లలను ప్రతి రోజు సమయం ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని చెప్పారు. కేంద్రాల్లో పిల్లలకు విద్యతో పాటు ఆట పాటలు కూడా నేర్పిస్తున్నట్లు చెప్పారు. వారికి నేర్పించిన విషయాలు తల్లితండ్రులకు వాట్సాప్ ద్వారా సమాచారం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎన్.వీర కుమారి, బివిసిమంగాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

జనసేన శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి - పోలవరం

జనసేన పోలవరం ఎంఎల్ఎ అభ్యర్థి చిర్రి బాలరాజు ఎన్నికపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం సంబరాలు చేశారు. మండలంలో స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షులు గుణపర్తి చిన్ని ఆధ్వర్యంలో జనసేన విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రసాద్, వారాడి సత్తిబాబు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - కామవరపుకోట

చింతలపూడి నియోజకవర్గంలో టిడిపి కూటమి గెలుపు సమిష్టి విజయమని మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ రామకృష్ణ అన్నారు. టిడిపి కామవరపుకోట మండలాధ్యక్షుడు కిలారు సత్యనారాయణ పుట్టిన రోజు వేడుకలు పాతూరులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ మురళీ రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు సత్యనారాయణ కామవరపుకోట మండలంలో ఎనలేని కృషి చేశారన్నారు. ఎన్నికల సమయంలో తనకు ఆరోగ్యం బాగా లేకపోయినా పార్టీ పట్ల అంకిత భావంతో పనిచేశారని మురళీతో పాటు నాయకులు కొనియాడారు. చింతలపూడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ విజయంలో కీలక పాత్ర పోషించిన మురళీని మండల నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. కూటమి విజయంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదని పార్టీ మండలాధ్యక్షుడు కిలారు సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు జుజ్జూరి బాబ్జి, సర్పంచి గూడపాటి కేశవరావు, వజీర్‌ఖాన్, ఘంటా గోపీ, కంచర్ల పుల్లాజి, జనసేన అధ్యక్షుడు బొబ్బిలి వీరబాబు, యలమర్తి రాంబాబు, పాకలపాటి రవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఉన్నత విద్య అందించడమే లక్ష్యం

శ్రీచలపతి కాలేజీ డైరెక్టర్, ఛైర్మన్ నాగార్జున

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతిఒక్కరూ ఉన్నత విద్య అభ్యసించాలనే లక్ష్యంతో శ్రీచలపతి కాలేజీ (డిస్టెన్స్ ఎడ్యుకేషన్) ముందుకు దూసుకుపోతుందని కళాశాల డైరెక్టర్, ఛైర్మన్ మళ్ల నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఏలూరులో ఈ కాలేజీని 2005లో ప్రారంభించినట్లు చెప్పారు. దూర విద్య ద్వారా బిఎ. బికాం, బిఎస్‌సి, ఎంఎ, ఎంకాం, ఎంఎస్‌సి, ఎంబిఎ, లైబ్రేరియన్ కోర్సులు ఈ కాలేజీలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కాలేజీకి వెళ్లి ఉన్నత విద్య అభ్యసించలేనివారికి శ్రీచలపతి కళాశాల ద్వారా అభ్యసిస్తున్నారన్నారు. సమయం లేదనో, తమ పనులకు ఆటంకం కలుగుతుందనో ఎంతోమంది ఉన్నత విద్యకు దూరమవుతుండడం గమనించిన తాను ఏ ఒక్కరకూ ఉన్నత విద్యకు దూరం కాకూడదనే భావంతో శ్రీచలపతి కాలేజీని స్థాపించినట్లు చెప్పారు. దూరవిద్య ద్వారా వేలాది మందికి ఉన్నత విద్యను అందిస్తున్నామన్నారు. పదో తరగతి, ఇంటర్ ఒకే సంవత్సరంలో పూర్తి చేసుకునేందుకు ఈ కాలేజీలో అవకాశం కల్పించడం విశేషమన్నారు. శ్రీచలపతి కాలేజీలో విద్య అభ్యసించిన ఎంతోమంది ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడేందుకు కృషి చేశామన్నారు. కాలేజీలో చేరినవారందరికీ ఎన్నో సూచనలు సలహాలందిస్తూ వారి అభ్యున్నతికి ఎంతగానో సహాయ పడుతున్నామన్నారు. అందరికీ ఉన్నత విద్యను అందించాలనే తపనతో కాలేజీని స్థాపించి ఎంతో మంది ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

నాగార్జున

శ్రీచలపతి కళాశాల

ప్రశాంతంగా పరీక్ష

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యా ద్వారా నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. రెండోరోజు బుధవారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షకు 164 మంది విద్యార్థులకు 119 మంది హాజరవ్వగా 45 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ విద్యార్థులు 201 మంది విద్యార్థులకు 177 మంది హాజరవ్వగా 24 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా పరీక్ష జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం తెలిపారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఈ నెల ఆరో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రాధాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాజుపోతేపల్లి 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని కేతవరం 11 కెవి ఫీడర్ ఆర్‌డిఎస్ఎస్ పనులు ఈ నెల ఆరో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరుగుతాయని చెప్పారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఓట్లేసిన అందరికీ ధన్యవాదాలు

టిడిపి నియోజకవర్గ పరిశీలకులు రామారావు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

టిడిపి కూటమికి ఓట్లేసిన అందరికీ కృతజ్ఞతలు అని చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు, పోలవరం ఎఎంసి మాజీ ఛైర్మన్ పారేపల్లి రామారావు అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని బయ్యన్నగూడెంలో ఆయన ఇంటి వద్ద బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గ్రహణం వీడిందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ అభివృద్ధి కోసం ఎన్‌డిఎ కూటమికి ఓటు వేశారన్నారు. ఇంతటి భారీ మెజారిటీ ఇచ్చిన ప్రతిఒక్క ఓటర్‌కు ధన్యవాదాలని చెప్పారు. తాను పరిశీలకుడిగా ఉన్న చింతలపూడి, పోలవరం, ఏలూరు ఎంపీ భారీ మెజారిటీతో గెలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పలు గ్రామాల నుంచి టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కొయ్యలగూడెం మండలాధ్యక్షులు పారేపల్లి నరేష్, ఎంపిటిసి సభ్యులు కాగితాల గణపతి, సుదగని సత్యనారాయణ, మల్లవరపు త్రిమూర్తులు, గెడ్డ శ్రీరామచంద్రమూర్తి, నల్లూరి గోపీ, గెడ్డ నాగబాబు, ఎనమందుల ప్రసాద్, పారేపల్లి పవన్, టెక్కెం సీతారాములు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో ఎన్ఆర్ఐ విద్యార్థి ప్రతిభ

సాయిప్రణవ్‌కు జాతీయ స్థాయిలో నాలుగో అత్యుత్తమ మార్కులు

ప్రజాశక్తి - ఏలూరు

నీట్-2024లో ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థి ప్రతిభ కనబరిచాడని ఏలూరు ఎన్ఆర్ఐ కాలేజీ సిఇఒ వి.తులసీరామ్ తెలిపారు. నీట్ ఫలితాల్లో కాలేజీ విద్యార్థి కెహెచ్.సాయిప్రణవ్ 720 మార్కులకు 705 సాధించి జాతీయస్థాయిలో నాలుగో అత్యుత్తమ మార్కులు సాధించాడని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం అభినందన సభ నిర్వహించిన విద్యార్థిని, తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఇంతటి ఘన విజయానికి కారకులైన అధ్యాపకులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల సిఇఒ తులసీరామ్ నీట్ ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు ఏలూరు చరిత్రలో ఇటువంటి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థి లేరన్నారు. ఈ మార్కులతో తమ ఏలూరు ఎన్ఆర్ఐ విద్యార్థి చరిత్ర సృష్టించాడని చెప్పారు. విద్యార్థికి, తల్లిదండ్రులకు ఎన్ఆర్ఐ కళాశాలల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కళాశాలల ఛైర్మన్ ఆలపాటి రవీంద్ర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపల్స్ వి.కనక రత్నం, ఇ.మురళీకృష్ణ, కె.ప్రభాకరరావు, ఎస్.సత్యనారాయణ, సిహెచ్. శివకుమార్, సిహెచ్ ఎస్‌వి.సత్యనారాయణ, కళాశాల ఎఒలు కె.మల్లికార్జునరావు, వి.రాట్నాలు, ఎస్.రామాంజనేయులు, జె.నాగరాజు, ఎ.చంద్రశేఖర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాయిప్రణవ్‌ను అభినందిస్తున్న వక్తలు

కౌంటింగ్‌కు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు

ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సహకరించిన సిబ్బందికి, మీడియా మిత్రులకు ఎస్‌పి మేరీ ప్రశాంతి అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆమె ఎస్‌పి కార్యాలయం నుంచి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పోలింగ్ అనంతరం ఓటింగ్ యంత్రాలను ఏలూరు నగరంలోని సర్ సిఆర్ఆర్ కళాశాలలో భద్రపరిచారని తెలిపారు. ఈ నెల నాలుగో తేదీ మంగళవారం నిర్వహించిన లెక్కింపు ప్రక్రి యలో పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బందితో పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పనిచేశారని చెప్పారు. వారందరికీ ఎస్‌పి అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

సమిష్టి కృషి వల్లే విజయం

టిడిపి నేత ముత్తారెడ్డి

చింతలపూడి : సమిష్టి కృషి వల్లే చింతలపూడి నియోజకవర్గంలో విజయం సాధించామని టిడిపి నేత, ఎఎంసి మాజీ ఛైర్మన్ జె.ముత్తారెడ్డి అన్నారు. సొంగా రోషన్ కుమార్ విజయంలో కీలక పాత్ర పోషించిన ముత్తారెడ్డిని టిడిపి నాయకులు, కార్యకర్తలు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి మండల నాయకులు మాటూరి వెంకటరామయ్య మాట్లాడుతూ ముత్తారెడ్డి 30 ఏళ్లకు పైగా టిడిపిని నియోజకవర్గంలో పటిష్ట పరుస్తూ వచ్చారన్నారు. నేటి విజయంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. ముత్తారెడ్డి మాట్లాడుతూ కూటమిలో అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషి, రోషన్ సేవా దృక్పాథం, కూటమి అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల నాయకత్వ పటిమ వల్ల రాష్ట్రంలో, నియోజకవర్గంలో విజయం సాధించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వెంకటరామయ్య, నాయకులు, కార్యకర్తలు కనిపేడ నాగేశ్వరరావు, రాజారెడ్డి, శ్రీను, తాటి మహీంద్రా, రాజారత్నం, మున్నా, కంచర్ల శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

'వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలతోనే కూటమి గెలుపు'

కలిదిండి : వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగిపోయిన ప్రజలు టిడిపి కూటమికి విజయం చేకూర్చారని టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంటలో బుధవారం ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు వంటి సమస్యలు పరిష్కారమవు తాయన్నారు. చంద్రబాబు అరెస్ట్ సమయంలో మద్దతిచ్చి, గెలుపులో కీలకపాత్ర వహించిన పవన్‌కళ్యాణ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. డిసి మాజీ ఛైర్మన్ నాగిడి వీరబ్రహ్మం, నాయకులు కోకా తాతయ్య, అండ్రాజు దుర్గారావు, నల్లమోతు వెంకటేశ్వరరావు, మోకా రాంబాబు, తిరుమాని గోపాలకృష్ణ, తిరుమలశెట్టి ఈశ్వర పరశురాముడు, పొన్నాల కొండలరావు, కొపనాతి బంగార్రాజు, రాంబాబు పాల్గొన్నారు.

ఉద్యోగులకిచ్చిన హామీలు అమలు చేయాలి

చంద్రబాబు, పవన్‌కు ఎపి ఎన్‌జిఒ నేతల అభినందన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించి త్వరలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేపట్టబోతున్న చంద్రబాబునాయుడుకు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, పోలీసులు, యూనిఫామ్ డిపార్ట్‌మెంట్స్‌లో పని చేస్తున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకుని ఈ ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి దోహదపడ్డారన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేసి, ఉద్యోగులకు సకాలంలో రావాల్సిన ప్రయోజనాల పట్ల శ్రద్ధ వహించాలని, సిపిఎస్ విధానం విషయంలో గట్టి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉద్యమాల్లో పాల్గొన్న సమయంలో గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, అంగన్వాడీ, ఆశావర్కర్లకు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు జీతాలు పెంచి ప్రతి నెలా ఒకటో తేదీన అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. పెన్షనర్లకు కూడా పింఛన్లు సకాలంలో అందేలా ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. ప్రతి ఉద్యోగి కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి కూడా సంక్షేమ, అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించి రాష్ట్ర సమగ్రాభి. వృద్ధికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు. ఉద్యోగులకు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బిల్స్‌ని వచ్చే మూడు నెలల్లో క్లియర్ చేసి ఉద్యోగుల మనస్సుని చూరగొనేలా ప్రభుత్వం పనిచేయాలని కోరారు. జిల్లాలో ఎన్నికైన ఎంఎల్ఎలకు, ఎంపీలకు ఉమ్మడి జిల్లా సంఘం తరపున శుభాకాంక్షలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి అవసరం

ఘనంగా ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రతి పౌరుడూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కెకెవి.బుల్లికృష్ణ చెప్పారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఆయన ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బుల్లికృష్ణ మాట్లాడుతూ ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణలో భాగమై ఉండాలని, ప్రతిఒక్కరూ విధిగా చెట్ల పెంపకం చేపట్టాలని చెప్పారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అబ్బినేని విజయకుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో న్యాయవాదులు కూడా భాగస్వామ్యం అవుతామని, ప్రజలు కూడా బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాసుదేవ్, సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ బి.రచన, ఎక్సైజ్ మేజిస్ట్రేట్ కె.స్పందన, బార్ అసోసియేషన్ కల్చరల్ సెక్రటరీ టి.సుబ్బారావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్ క్రాస్ కార్యాలయం ఆవరణలో జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూతాపం రోజురోజుకీ పెరిగిపోతుందని, అందుకు ముఖ్య కారణం రకరకాల కాలుష్యాలు పెరిగి పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటడం, ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించడం, సోలార్ కరెంటును వినియోగించడం, భూమికి హాని కలిగించే ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు ఉపయోగించడం వంటివి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యుడు ఎం.చక్రవర్తి, రెడ్ క్రాస్ వాలంటీర్లు ఎ.సూర్యనారాయణ, వి.నాగరాజు, కె.శ్రీనివాస్, పి.హర్ష, సుధీర్, గౌతమి, జయశ్రీ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జంగారెడ్డిగూడెం సబ్ డిఎఫ్ఒ వెంకట సుబ్బయ్య అన్నారు. మండలంలోని కామయ్యపాలెం బీట్ పరిధిలోని రాచన్నగూడెం అటవీ ప్లాంటేషన్‌లో 500 మొక్కల వరకు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. అనంతరం గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ రేంజ్ అధికారి ఎస్‌కె. వలీ, సెక్షన్ అధికారి దినేష్, బీట్ అధికా రులు, భవాని, లలిత, రాంబాబు, రాఘవులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి : భావితరాల భవిష్యత్తు కోసం మొక్కలను విధిగా నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు చెప్పారు. మండవల్లి గ్రంథా లయ ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట మొక్కలు నాటి పెంచాలన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అది భూమిలో కలవకుండా భూమి పొరల్లో ఉండిపోతుందని, దీంతో పర్యావరణం దెబ్బతింటుందని వివరించారు. ప్లాస్టిక్ నిషేధం చాలన్నారు. అనంతరం పర్యావరణాన్ని పరిరక్షిస్తా మని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకాలు షేక్ పరివీణ, కార్తీక్, పవన్, ధవళేశ్వర్, రణధీర్, ఈశ్వర్, పునీత్, వాసవి పాల్గొన్నారు.

పోలవరం : ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా బుధవారం అటవీశాఖ ఆధ్వర్యంలో వింజరం సచివాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ డిఆర్ఒ ఎ.సూరిబాబు, కె.భానుప్రవీణ్, డి.రాజేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి : చెట్లను పెంచడం ద్వారా పర్యావరణానికి మేలు చేసినవారమవుతామని ఎంఇఒ పిడుగు ప్రభాకరబాబు అన్నారు. స్థానిక ఎంఆర్‌సి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రకృతి లేకుండా మానవ మనుగడ లేదని, ఆ అవసరాన్ని గుర్తించిన ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించాలని తీర్మానించిందన్నారు. 1972లో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ద్వారా ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. 1973 జూన్ ఐదో తేదీన తొలి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నామన్నారు. అందరూ విధిగా మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకం మానేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సిఆర్‌పిలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : మొక్కల పెంపకం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు పకృతి సమతుల్యతను కాపాడవచ్చని నూజివీడు ఐసిడిఎస్ సిడిపిఒ ఎస్‌వై.నూరానీ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం, బాల్యరంభ దశ విద్యాదినోత్సవ సందర్భంగా మండల పరిధిలోని వడ్లమాను, ఆగిరిపల్లి, చిన్న ఆగిరిపల్లి, సింగన్నగూడెం, నూగొండపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్ల వద్ద మొక్కలు నాటడం, ఇంకుడు గుంతలు తవ్వటం, పెరటితోటల పెంపకం గురించి, విద్యా ప్రాముఖ్యత గురించి ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ఎసిడిపిఒ డివి.నాగేశ్వరి, ఆగిరిపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ జి.రాగమయి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : మొక్కలు నాటుతున్న బుల్లికృష్ణ

ఇకపై రాష్ట్రంలో సంక్షేమ పాలన

ముద్దరబోయిన

ప్రజాశక్తి - ముసునూరు

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి అద్వితీయమైన ఫలితాలను సాధించి రాష్ట్రంలో నెలకొన్న రాక్షస పాలన అంతమొందించి, చంద్రబాబు సంక్షేమ పాలనను అందించనున్నారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడులోని ఆయన కార్యాలయంలో టిడిపి కూటమి విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎచంద్రబాబు అధికారంలోకి రావడంతో రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణం, పారిశ్రామిక స్థాపన శరవేగంగా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ తాళం వెంకటేశ్వరరావు, అక్కినేని సత్యనారాయణ, నెరసు శ్రీనివాసరావు, అమ్మవారిగూడెం సర్పంచి జలసూత్రం కొండలరావు, అప్పికట్ల నాగేశ్వరరావు, చెరుకూరి వెంకటరామయ్య, బెజవాడ శ్రీనివాసరావు, జొన్నలగడ్డ శివలక్ష్మి, అన్నే విజయలక్ష్మి, బుర్ల నాగపద్మ, బాణావతి నాగమణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

KANAKADURGA
FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్: -1st ఫ్లోర్, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
- ఏలూరురోడ్డు, లక్ష్మిథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
- గ్రౌండ్‌ఫ్లోర్,అక్షరానంద స్కూల్ ఎదురు, ధర్మాజీగూడెం-534462, ఏలూరు జిల్లా.
- 16-225, ఫస్ట్‌ఫ్లోర్, పాతబస్టాండ్ దగ్గర, జివిమాల్ సూపర్ మార్కెట్, మెయిన్‌రోడ్డు, చింతలపూడి. ఫోన్: 9492934845, -DRNO :10-11-5/2 , 1 st Floor, Ganesh Chowk Center , Near Ravindra bharathi school, NIDADHAVOLU
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-06-2024 ఉ. 10-00 గంలకు మా బ్రాంచి ఆఫీసు నందు 1446.59 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు #238-4-11, Subbammadevi High School Road, , Opp.Zed Labs, R.R.Peta, Eluru- 534 002. నందు వేలం వేయబడును. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
#238-4-11,Subbammadevi High School Road, Opp.Zed Labs,R.R.Peta, Eluru-534 002.
Contact person, area manager, p.hemanth kumar-80746-56196

పాస్‌పోర్టు పోయినది
VALAVALA MURALI అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.05-06-2014న L9579535 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.27-05-2024న మా ఇంటి నుండి మొగల్తూరు గ్రామం, మెయిన్‌రోడ్‌కు వెళ్తున్నపుడు నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.
VALAVALA MURALI
S/o. Valavala Dharma Rao
D.No. 1-58, Near Kanaka Durga Temple
Linganaboinacherla, Narasapuram (M)-534275 Dt., A.P.

CHANGE OF NAME
I, MEENAMBAKAM RAMACHANDRA RAO, S/o. Meenambakam Jayaram (late), Residing at 3C-17-10/1, Padamara Veedhi, Beside Kacheri Chavidi, Kotta Ganganamma Gudi Backside, Eluru, West Godavari District, (I Changing my Name from **MEENAMBAKAM RAMCHANDRA RAO** (Old Name) to **MEENAMBAKAM RAMA CHANDRA RAO** (New Name). Henceforth Iam being called as **MEENAMBAKAM RAMACHANDRA RAO** (New Name) for all purposes.

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో
C.C. No. 870/2022
M. గౌరీ మనోహర్,
S/o. M.చంద్రయ్య,
వయస్సు 33 సం॥, హిందూ, బిజినెస్,
R/o.పాత కందుకూరు గ్రామం,
ఆళ్లగడ్డ మండలం, నంద్యాల జిల్లా. ...Complainant
V/S
రాఫాక రవికుమారు,
S/o. రాజారావు,
వయస్సు 40 సం॥, హిందూ, బిజినెస్,
R/o H. No.1-146, శ్రీరామ్ నగర్,
మల్లిపూడి (గ్రామం),
పెనుమంట్ర మండలం,
పశ్చిమగోదావరి జిల్లా. ...Accused
ముద్దాయికి సీఆర్‌పీసీ 82 సెక్షన్ నోటీసు
ఫిర్యాది, ముద్దాయి అయిన నీపై చెక్ బౌన్స్ కేసు దాఖలు చేసి ఉన్నందున సదరు కేసులో నీ పై అరెస్ట్ వారెంట్ వచ్చినది. సదరు అరెస్ట్ వారెంట్ అమలు కాకుండా నీవు కానరాక తప్పించుకుంటూ ఉన్నందున నీ యొక్క హాజరు నిమిత్తం 10-06-2024 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో మీరు స్వయంగా హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల కోర్టు వారు నీ పై తదుపరి చర్య తీసుకోబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా: 10-06-2024
కె.వి.సుబ్బశర్మ,
కె.ఆనంద్,
ఫిర్యాది తరపు అడ్వకేట్స్,
ఆళ్లగడ్డ.
సెల్ నెం. 9440848108

గౌరవ కుటుంబ న్యాయస్థానం, (Family Court)
ఖమ్మం
O.P No. 73 /2023
Between:
డా॥ సట్టు నరేష్ ..... వాది
మరియు
సట్టు @ కాటూరి మేరీ రత్నకుమారి .... ప్రతివాది
To,
సట్టు @ కాటూరి మేరీ రత్నకుమారి, భర్త: సట్టు నరేష్, తండ్రి: లేటు కాటూరి సుబ్బారావు, వయస్సు: 36, ప్రవేటు ఉద్యోగి, నివాసం: ఇంటి నెంబర్: 15-177, NTR కాలనీ, తాడిచెర్ల గ్రామం, కామవరపుకోట మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
పైన సూచించిన కేసునందు మీరు ప్రతివాదిగా ఉన్నారు. ఇట్టి కేసులో మీకు పలుమార్లు నోటీసులు పంపినప్పటికిని మీరు ఉద్దేశ్య పూర్వకంగా తిరస్కరించినందున గౌరవ కోర్ట్ వారి అనుమతితో ఈ ప్రకటన ఇవ్వడమైనది. ఇట్టి కేసు మీ హాజరు నిమిత్తం ది. 24.06.2024న పైన తెలిపిన కోర్ట్ నందు కలదు. కావున మీరు ది. 24.06.2024 న ఉదయం 10.30 నిమిషములకు మీరు స్వయంగా కానీ, మీ న్యాయవాది ద్వారా కానీ హాజరై మీ అభ్యంతరములు తెలియజేయగలరు లేనియెడల కేసు మీ పరోక్షంలో నిర్ణయించబడును
(కోర్ట్ వారి అనుమతితో)
ఇట్లు,
ఏడునూతల శ్రీనివాసరావు,
ఏడునూతల అనురాధ,
న్యాయవాదులు, ఖమ్మం పట్టణం,
సెల్ నంబర్ .9849039167